సాక్షి
సిద్దిపేట
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



చింతమడక చిరుతలు

చింతమడక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపుతున్నారు.

వివరాలు 8లో ▸



హోమో సెక్స్‌కు..

వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. హోమో సెక్స్‌కు అడ్డుచెప్పడంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తేల్చారు. వివరాలు 8లో ▸

సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్!

జహీరాబాద్: సబ్ రిజిస్ట్రార్ హాఫీజ్ సస్పెండ్ అయినట్లు తెలుస్తోంది. ఈయన గతంలో గజ్వేల్‌లో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన సమయంలో ఓ భూమికి సంబంధించి వ్యవహారంలో అవకతవకలకు పాల్పడిన కారణంగా ఉన్నతాధికారులు వేటు వేసినట్లు సమాచారం. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు ముక్కెర సంపత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ 18వ సదస్సును మార్చి 25న మహారాష్ట్రలోని పూణెలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు సంబంధించి 500 మంది దళిత బహుజన సాహితీ వేత్తలు సదస్సులో పాల్గొంటారని తెలిపారు. సామాజిక, సాహిత్య, వైద్య, క్రీడా, కళారంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న మారుమూల ప్రాంతాల వ్యక్తులకు జాతీయ స్థాయిలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చండి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జంగిటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలన్నారు. పిల్లలను ఎక్కువగా పంపిణీ చేస్తామని చెప్పి ఒక్క చేప పిల్లను కూడా చెరువుల్లో వదలలేదన్నారు. ముదిరాజ్‌లకు న్యాయం చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



అ ఆకృతిలో విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం పురస్కరించుకుని మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. మాతృ భాషా గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతసాగర్ ఉన్నత పాఠశాలలో అ అక్షరాకృతిలో విద్యార్థులు కూర్చున్నారు.

నల్లాలకు మోటార్లు బిగించొద్దు

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్



స్థానికులతో మాట్లాడుతున్న ఆశ్రిత్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నల్లాలకు మోటార్లు బిగించడం సరికాదని, ఎవరైనా బిగిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. రంగధాంపల్లిలో పలువురు తాగునీటిని వృథా చేయడం గమనించిన ఆయన నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటి సరఫరా ఖర్చుతో కూడుకున్నదని, వృథా కాకుండా చూడాలని చెప్పారు. అలాగే చెత్తను బహిరంగ ప్రాంతాల్లో వేయకుండా మున్సిపల్ వాహన సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఉండడం గమనించి ఆ స్థలం యజమానికి నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన



బ్యాంకు కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న ఉద్యోగులు

సిద్దిపేటకమాన్: సమస్యలు పరిష్కరించాలంటూ బ్యాంకు ఉద్యోగులు సిద్దిపేటలోని యూనియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది మాట్లాడుతూ.. బ్యాంకుల్లో తగినంత సిబ్బంది లేకపోవడంతో పని ఒత్తిడి పెరిగిందన్నారు. అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలని, బ్యాంకుల విలీనం చేయకుండా ఆపాలని, ఐదు రోజుల పని దినాలు, ఫిక్స్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచాలని, పలు రకాల తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ , కెనరా బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు నామమాత్రం

భూములు అన్యాక్రాంతం

పర్యవేక్షణ కరువు.. అక్రమార్కుల దరువు

- ఉమ్మడి మెదక్ జిల్లాకు ఒక్కరే అధికారి
- అక్రమాల నియంత్రణ వట్టిమాటే
- ఏటా రూ.కోట్లల్లో వక్ఫ్‌భూముల 'దందా'
- లీజుల నెపంతో శాశ్వత నిర్మాణాలు
- పట్టణాల్లో పరిస్థితి మరీ అధ్వానం

వక్ఫ్‌బోర్డు నామమాత్రంగా మారడంతో అక్రమార్కులకు వరంలా మారింది. ఇష్టారాజ్యంగా వక్ఫ్ భూములను ఆక్రమిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు కేవలం ఒక్క అధికారి మాత్రమే ఉండటం అక్రమాల నియంత్రణ వట్టిమాటగానే మిగిలిపోయింది. ఏటా రూ.కోట్లల్లో వక్ఫ్‌భూముల 'దందా' యథేచ్ఛగా సాగుతోంది. ప్రత్యేకించి సిద్దిపేట జిల్లాలో పరిస్థితి మరీ అధ్వానం. జిల్లాలో సుమారు 4వేల ఎకరాల వక్ఫ్‌భూములున్నాయి. ఇందులో లీజుల పేరుతో 25శాతంలోపే వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్నాయి. మిగిలిన భూముల్లో అధిక శాతం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.



గజ్వేల్:

ఉమ్మడి మెదక్ జిల్లాలో వక్ఫ్‌బోర్డుకు చెందిన విలువైన భూములు, ఆస్తుల పరిరక్షణ గాలిలో దీపంలా మారింది. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు కలుపుకొని ఒక్కరే అధికారి ఉండటంతో పర్యవేక్షణ కరువైంది. నిజానికి ఒక్కో జిల్లాకు ఇన్‌స్పెక్టర్‌తోపాటు కార్యాలయ సిబ్బంది నియమించాల్సి ఉండగా.. ఏళ్ల తరబడి పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఫలితంగా అక్రమాలను నియంత్రించడం సాధ్యం కావడం లేదు. ఇకపోతే వక్ఫ్ బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలను కట్టబెట్టాలని గతంలో ప్రతిపాదించారు. కానీ అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా పట్టణాలు, గ్రామాల్లో వక్ఫ్‌బోర్డు ఆస్తుల రక్షణకు ఆ బోర్డుకు చెందిన అధికారులు రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖలపై ఆధారపడాల్సి వస్తున్నది. ఈ పరిస్థితి వల్ల చాలాచోట్ల వక్ఫ్ బోర్డు ఆస్తుల 'దందా'కు అధికారులు సైతం వంతపాడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నిజానికి వక్ఫ్‌బోర్డుకు జ్యుడీషియల్ అధికారం ఇచ్చి ఉంటే వారే రంగంలో దిగి నోటీసులు ఇవ్వడం మొదలుకొని కోర్టుకు తరలించే అవకాశం ఉండేది. కానీ పరిస్థితి భిన్నంగా ఉండటం అక్రమార్కులకు కలిసివస్తున్నది.

అక్రమార్కులకు కాసుల వర్షం..

సిద్దిపేట జిల్లాలో వక్ఫ్‌భూముల 'దందా' దళారులకు కాసుల వర్షం కురిపిస్తున్నది. జిల్లాలో 4వేల ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. ఆయా పట్టణాల్లోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న ఈ భూముల విలువ ఎకరాకు రూ.1–2కోట్లకుపైగానే పలుకుతోంది. ఇంతటి విలువైన భూములను ఇష్టానుసారంగా ఆక్రమించేస్తున్నారు. లీజుల నెపంతో శాశ్వత నిర్మాణాలను చేపడుతున్నారు. నిజానికి వక్ఫ్‌బోర్డు ద్వారా గతంలో ఉన్న జీఓ ప్రకారం మూడేళ్ల పాటు లీజుకు పొందేవారు. (ప్రస్తుతం దీనిని 30ఏళ్లకు పెంచుతూ జీఓ ఇచ్చారు) ఈ లీజుకు నామమాత్రపు కిరాయి చెల్లిస్తారు. ఈ కిరాయి చెల్లించకపోతే లీజును రద్దు చేసి సదరు భూమిని వక్ఫ్‌బోర్డు తిరిగి స్వాధీనం చేసుకోవాలి. కానీ ఎక్కడా కూడా ఈ నిబంధన అమలు కావడం లేదు. స్థానిక రాజకీయ నేతల అండతో పాటు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ 'దందా' యథేచ్ఛగా సాగుతోంది.

వెలుగుచూసిన అక్రమాలు



గజ్వేల్ పట్టణంలో వక్ఫ్‌బోర్డు భూములు కలిగిన జాలిగామ బైపాస్ రోడ్డు ప్రాంతం

గజ్వేల్ నియోజకవర్గంలో వక్ఫ్‌భూములు అక్రమాలపై 'సాక్షి' జరిపిన పరిశీలనలో ఎన్నో విషయాలు బయటపడ్డాయి. గజ్వేల్ మండలంలోని 14గ్రామాల్లో 768.18ఎకరాల వక్ఫ్ భూములున్నాయి. ఇందులో సుమారు 400ఎకరాల వరకు గజ్వేల్ పట్టణంలోనే ఉన్నాయి. బయ్యారంలో మరో 300 ఎకరాలకు పైగా ఉంది. మిగిలిన గ్రామాల్లో అరకొరగా ఉండగా ఎక్కువ భాగం ఆక్రమణకు గురైంది. ప్రత్యేకించి మున్సిపాలిటీ పరిధిలోని వక్ఫ్ భూముల వ్యవహారంలో ప్రతిఏటా పెద్ద ఎత్తున వివాదాలు కొనసాగుతున్నాయి. పట్టణంలో ఉన్న వక్ఫ్ భూముల విలువ ఎకరాకు రూ.2కోట్లకుపైగానే ఉంటుంది. ఈ లెక్కన ఆస్తుల విలువ రూ.800కోట్లకుపైనే ఉంటుందని అంచనా. ఇప్పటికే ఈ భూముల్లో 80శాతం వరకు నిర్మాణాలు జరిగిపోగా కొన్ని కాంప్లెక్స్‌లుగా, మరికొన్ని నివాస గృహాలుగా మారిపోయాయి. మిగిలిన 30శాతం భూముల్లోనూ 2011నుంచి స్థానిక నాయకుల అండతో వక్ఫ్‌బోర్డు తమకు భూములను లీజుకు ఇచ్చిందనే నెపంతో ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, తూప్రాన్ మండలాల్లో మరో 1031ఎకరాల వక్ఫ్ భూములు ఉండగా, ఇందులో 90శాతానికిపైగా ఇప్పటికే పరాధీనమయ్యాయి. సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.

ఆక్రమణలపై కఠిన చర్యలు

జిల్లాలో వక్ఫ్‌భూముల వ్యవహారంపై తరుచూ ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. ఇలాంటివి చూస్తూ ఊరుకునేదిలేదు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతాం. అక్రమమని తేలితే ముందుగా నోటీసులు ఇస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. జ్యుడీషియల్ అధికారాలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడలేదు.

– సాబేర్ హుస్సేన్, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యమివ్వండి

డిప్యూటీ సీఎంకు దళిత బహుజన ఫ్రంట్ వినతి

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కను దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి లింగుపల్లి శంకర్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎంను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 2024–25 బడ్జెట్‌లో కేవలం 7శాతం నిధులు కేటాయించి తమ హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అంతర్జాతీయ మోడల్ స్కూళ్లను అన్ని మండల కేంద్రాల్లో ప్రారంభించాలని అన్నారు. విద్యా వ్యవస్థను ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. బడ్జెట్‌ల 15శాతం విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ డీబీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టిందని ఆయన తెలిపారు.

పాఠశాలల్లో కనీస వసతులు కరువు

గజ్వేల్‌రూరల్: బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం గజ్వేల్‌లో డీబీఎఫ్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏగొండస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువయ్యాయని, అసర్ నివేదిక ప్రకారం 5.4శాతం పాఠశాలల్లో బాత్‌రూమ్‌లు లేవని, 19శాతం బడులు పాడుబడ్డాయని పేర్కొన్నారు గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలతో పాటు పాఠశాలల్లో పౌష్టికరమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

గోటి తలంబ్రాల దీక్షలో పాల్గొనడం అదృష్టం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్‌రూరల్: భద్రాచల సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే గోటి తలంబ్రాలను సిద్ధం చేసే కార్యక్రమంలో భాగస్వాములవడం తమ అదృష్టమని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. భద్రాచలం నుంచి గోటి తలంబ్రాలను సిద్ధం చేసేందుకు వడ్లు శుక్రవారం గజ్వేల్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలోని మురళీకృష్ణాలయంలో రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్సారెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతానికి 3వ సారి గోటి తలంబ్రాల కోసం వడ్లు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు సేవలను కొనియాడుతూ అభినందించారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేష్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, దేవాలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే పోస్టాఫీస్ కార్యాలయాన్ని ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేసిన డీసీసీ అధ్యక్షుడిని పోస్టల్ అధికారులు శాలువ కప్పి సన్మానించారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి, లచ్చపేటలోని పీఎస్‌తో పాటు చీకోడ్, గంభీర్‌పూర్, రామక్కపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులతో మాట్లాడి పాటు పలు సూచనలు ఇచ్చారు.విద్యార్థి జీవితంలో పదవతరగతి తొలిమెట్టు అన్నారు. బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకొని బాగా చదివించాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. స్లిప్ టెస్టులు, ప్రాక్టీస్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళ స్నాక్స్ అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాసు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించండి

- నిత్యం మెనూను అమలు చేయండి
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- బీసీ సంక్షేమ వసతి గృహాల అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: జిల్లాలోని అన్ని వసతి గృహాలు, పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ తప్పకుండా అమలు చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బీసీ వెల్ఫేర్ వసతి గృహ సంక్షేమ అధికారులతో కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఉదయం వివిధ రకాల అల్పాహార పదార్థాలను వండేందుకు సరిపడా వంట పాత్రలు లేవని వాటిని సమకూర్చాలని, కూరగాయలు, నాన్ వెజ్, ఫ్రూట్స్, పాలు, పెరుగు టెండర్ ద్వారా హాస్టళ్లకు సరఫరా చేయాలని హెచ్‌డబ్ల్యూఓలు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు బలంగా, ఆరోగ్యంగా ఎదిగేందుకు ప్రభుత్వం రూపొందించిన కామన్ డైట్ మెనూ తప్పకుండా అందించాలన్నారు. మార్కెట్లో అన్ని రకాల కాయకూరలు, ఆకుకూరలు అందుబాటులో ఉన్నాయన్నారు. రోజు ప్రతీ పూటకు సూచించిన ఆహార పదార్థాలను మాత్రమే అందించాలన్నారు. త్వరలో హాస్టళ్లకు వంట పాత్రలను సరఫరా చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని బీసీ వెల్ఫేర్ హాస్టళ్లను సందర్శించి సమస్యలను తెలుసుకొని నివేదిక అందించాలని జిల్లా ఇన్‌చార్జి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, డీఆర్వో నాగరాజమ్మను ఆదేశించారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీపీ అనురాధతో కలిసి విద్య, రెవెన్యూ, పోలీస్, రవాణా, వైద్య, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుంచి జరిగే వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 43 పరీక్షా కేంద్రాల్లో 20,595 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి నిఘా పెట్టాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి, కస్టోడియన్ , డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పాటు, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల, కళాశాల సందర్శన

పాఠశాలల్లో తప్పకుండా మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. శుక్రవారం చిన్నగుండవెల్లి శివారులోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల ప్రాంగణంలోని తరగతి గదులను, భోజనశాలలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు సన్నద్ధతపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాను ప్రకాష్, తహసీల్దార్ సలీం , మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, జిల్లా వైద్యాధికారి పల్వాన్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరుతడి కళకళ



అందివచ్చిన నీటి వనరులతో రైతులు ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. మొక్కజొన్న, టమాటా, పొద్దుతిరుగుడు, మిర్చి, క్యాబేజీ వంటి పంటలకు స్ప్రింక్లర్లు, డ్రిప్ వంటి పరికరాలతో నీటిని ఆదా చేస్తూ ముందుకు సాగుతున్నారు. మరో పక్క కాలువల ద్వారా పంటలకు నీటిని పారిస్తున్నారు. ఎక్కడ చూసినా ఆరు తడి పంటలు పచ్చగా కళకళలాడుతూ దర్శనమిస్తున్నాయి. – మిరుదొడ్డి(దుబ్బాక)

మిరుదొడ్డిలో పొద్దు తిరుగుడు పంట



అందెలో సాగవుతున్న క్యాబేజీ

అధిష్టానం వద్దకు కమలం కయ్యం

తీవ్ర చర్చనీయాంశమైన సాక్షి కథనం

- రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన సీనియర్ నేతలు
- 'యెండెల'తో ప్రత్యేక భేటీ
- నడ్డాకు, ముఖ్యనేతలకూ మెయిల్ ద్వారా ఫిర్యాదు

దుబ్బాక: 'కమలంలో ముసలం..' శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడి ఎన్నికపై సీనియర్లు అలక బూనిన విషయం విదితమే. ఈ క్రమంలో అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించి పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రయత్నాలు సారించినట్లు తెలుస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ మీడియాతో మాట్లాడవద్దంటూ, ఎమ్మెల్సీ ఎన్నికలు అయ్యే వరకు ఓపిక పట్టాలంటూ అసంతృప్తితో ఉన్న సీనియర్లకు రాష్ట్ర ముఖ్య నాయకులు సూచించినట్లు సమాచారం.

రాష్ట్ర సంఘటన కార్యదర్శిని కలిసిన నేతలు

జిల్లాలోని బీజేపీ సీనియర్ నాయకులు బాలేశ్‌గౌడ్, విద్యాసాగర్, గురువారెడ్డి, కాన్గంటి శ్రీనివాస్, రోశయ్య, మల్లేశంతోపాటు సుమారు వంద మందికి పైగా ముఖ్యనాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్‌జీని కలిసి జిల్లా అధ్యక్షుడి ఎన్నికలో జరిగిన పరిణామాలపై విన్నవించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి యెండెల లక్ష్మీనారాయణతోనూ భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తి కాగానే ఈ అంశంపై పూర్తిస్థాయిలో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.



కేంద్ర మంత్రులకూ ఫిర్యాదు

జిల్లాలో బీజేపీ అధ్యక్షుడి నియామకంపై జాతీయ అధ్యక్షుడు నడ్డాతోపాటు ముఖ్య నాయకులకు ఫిర్యాదు చేశారు. జిల్లా అధ్యక్షుడి నియామకాన్ని ఏ ప్రాతిపదికన జరిగిందని, 30 ఏళ్లకు పైబడి పార్టీలో పనిచేస్తున్న తమను కాదని కనీసం పార్టీలో క్రియాశీలక సభ్యత్వం కూడా లేని వ్యక్తిని ఎలా అధ్యక్షుడిగా నియమిస్తారని అందులో పేర్కొన్నట్లు సమాచారం. నడ్డాతో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ రఘునందన్‌రావు లకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఏదేమైనా జిల్లా బీజేపీలో చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.

క్లుప్తంగా

పరిశ్రమలో అగ్ని ప్రమాదం

ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని ఖాజిపల్లి పారిశ్రామిక వాడాలోని హెటిరో ల్యాబ్ పరిశ్రమలో గురువారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి కథనం మేరకు.. పరిశ్రమలోని డ్రైయర్ వద్ద రసాయనాలకు చెందిన ఇంటర్మీడియట్ పౌడర్ కలుపుతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడే పని చేస్తున్న పరిశ్రమ ఉద్యోగి సీహెచ్.వీరవెంకట రెడ్డి(49), బీహార్‌కు చెందిన మరో ఇద్దరు కార్మికులు శైలేంద్ర ప్రసాద్ (38), శేషు కుమార్ (29)కు మంటలు అంటుకొని తీవ్రంగా గాయపడ్డారు. అప్రమత్తమైన యాజమాన్యం గాయపడ్డ కార్మికులను నగరంలోని యశోద ఆస్పత్రికి తరలించారు. అనంతరం మంటలను అదుపులోకి తెచ్చారు. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా పీసీబీ యంత్రాంగం, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారుల పర్యవేక్షణ కరువైందని కార్మిక కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రమాద ఘటనపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాల్య వివాహం అడ్డగింత

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఏఆర్ గార్డెన్‌లో శుక్రవారం జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. అధికారుల కథనం మేరకు.. మండలంలోని గాగ్గిళ్లాపూర్ గ్రామానికి చెందిన మైనర్‌ని రేబర్తి గ్రామానికి చెందిన అబ్బాయితో వివాహం జరుగుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, తహసీల్దార్ రహీం, ఎస్ఐ షేక్ మహబూబ్, సూపర్‌వైజర్ పుష్పలత వివాహ మండపం వద్దకు వెళ్లి పెండ్లిని నిలిపివేశారు. అమ్మాయికి 18 ఏళ్లు నిండలేదని అధికారులు ధ్రువీకరించి, అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మేజర్లు అయిన తర్వాతే వివాహాన్ని జరిపిస్తామని ఇరువర్గాల నుంచి అధికారులు లిఖిత పూర్వకమైన హామీ పత్రాన్ని తీసుకున్నారు.

అక్రమంగా ఇసుక డంప్

225 టన్నులు సీజ్ చేసిన పోలీసులు



ఇసుకను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొండపాక(గజ్వేల్): అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న చిరుకూరి నాగేశ్వర్‌రావు కొంత కాలంగా మండలంలోని మంగోల్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను డంప్ చేసుకుంటూ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. శుక్రవారం నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు చేసి 200 టన్నుల భారీ ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కుకునూరుపల్లి గ్రామ శివారులోని వేంకటేశ్వర రెడీ మిక్స్ కంపెనీ సమీపంలో కొంత కాలంగా కొంతం రాజేశం మల్లన్న సాగర్ నిర్మాణ కాల్వల్లోంచి నాసిరకం ఇసుకను తీసుకొస్తూ నిల్వ చేస్తున్నాడు. రెడీమిక్స్ నిర్వహణతోపాటు ఇతర గ్రామాల వారికి ఎక్కువ ధరకు అమ్ముతుండగా 25 టన్నుల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): పాము కాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని అయినాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మంజలక్ష్మీ (55) శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన స్థానికులు వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

చింతమడక చిరుతలు

వారు మైదానంలో పరుగెడితే చిరుతలే.. ఏ పోటీల్లో పాల్గొన్న పతకం రావాల్సిందే. చదువుల్లోనే కాదు ఆటల్లోనూ తగ్గేదేలే అంటున్నారు సిద్దిపేట జిల్లా రూరల్ మండల పరిధిలోని చింతమడక గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. ఇక్కడి విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రత్యేక నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. అథ్లెటిక్స్‌లోని పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తెస్తున్నారు.

– సిద్దిపేటరూరల్:



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

- పేద కుటుంబాల నుంచి వచ్చి క్రీడల్లో సత్తా
- బరిలోకి దిగితే బంగారు పతకాలే
- జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుల కృషి..

ప్రభుత్వ పాఠశాల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులను చదువుతోపాటు పలు రంగాల్లో తీర్చిదిద్దుతూ వారికి బంగారు భవిష్యత్‌ను అందించేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. చదువు ఒక్కటే ప్రాధాన్యం కాకుండా వారికి ఇష్టమైన రంగాలను, లక్ష్యాలను గుర్తించి వారి ఆ దిశగా ముందుకు సాగేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకుగాను తల్లిదండ్రులు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుంటూ క్రీడలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయ కుటుంబాలకు చెందిన విద్యార్థులు వారి బంగారు భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఎంతో కష్టపడుతూ పాఠశాలకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకొస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, పీడీ వెంకటస్వామి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకు వెళ్తున్నామని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా స్థాయి ఓవరాల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జట్టు (ఫైల్)

జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ

ఉస్మానియా యూనివర్సిటీలో 18, 19వ తేదీల్లో జరిగిన అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీలాస్య (400 మీటర్స్, హైజంప్), పిట్ల వైష్ణవి రన్నింగ్ విభాగాల్లో పాల్గొన్నారు. అదే విధంగా పాఠశాలకు చెందిన కర్ల కార్తీక్ (600 మీటర్లు రన్నింగ్), రిషికుమార్ లాంగ్‌జంప్, వినిల్ రెడ్డి జావెలిన్‌త్రో, గీతిక (హైజంప్, లాంగ్‌జంప్), అవంతిక 600 మీటర్స్, త్రయత్నాన్ (60 మీటర్లు రన్నింగ్, లాంగ్ జంప్, 600 మీటర్లు రన్నింగ్), గోపిక (ఖోఖో), మిట్టపల్లి దివ్య (కబడ్డీ) విభాగాల్లో సీఎం కప్‌తోపాటు, ఎస్‌జీఎఫ్, జూనియర్ పోటీల్లో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



నా పేరు పిట్ల సాయిచరణ్. 9వ తరగతి చదువుతున్నాను. నాకు జావెలిన్ త్రో అంటే చాలా ఇష్టం. ఇప్పటికి రెండు సార్లు విజేతగా నిలిచాను. హన్మకొండలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. మా అమ్మానాన్నలతోపాటుగా ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో ఉంది. నాకు జాతీయ స్థాయిలో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది. దానికోసం సాధన చేస్తున్నాను.

– పిట్ల సాయిచరణ్, 9వ తరగతి , శంకర్‌నగర్

ఆర్మీలో ఉద్యోగమే లక్ష్యం



మాది వ్యవసాయ కుటుంబం. బాగా చదువుకుంటూ ఆటలు ఆడుతాను. ఇటీవల జిల్లా అథ్లెటిక్స్ కిడ్స్ జావలిన్‌త్రోలో ప్రథమ స్థానం సాధించాను. హన్మకొండలో జరిగిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. క్రీడల్లో బాగా రాణించి ఆర్మీ ఉద్యోగం సాధించాలని ఉంది.

– వట్టిపల్లి వినీల్‌రెడ్డి, 8వ తరగతి, చింతమడక

దేశానికి సేవ చేయాలి



నేను ఇటీవల సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన సబ్ జూనియర్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ లాంగ్ జంప్‌లో బంగారు పతకాన్ని సాధించాను. అదే విధంగా మంచిర్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఇంకా మరికొన్ని అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఉంది. ఆర్మీలో చేరేందుకు కష్టపడతాను. ఉద్యోగం సాధించి దేశానికి సేవ చేస్తా.

– పిట్ల రిషికుమార్, 6వ తరగతి

ఉదయం, సాయంత్రం సాధన



నేను రెండు జిల్లా స్థాయిలో క్రీడల్లో విజేతగా నిలిచాను. రోజు ఉదయం సాయంత్రం సాధన చేస్తూ మరింతగా రాణించేందుకు కృషి చేస్తున్నా. ఎప్పటికైనా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బాగా ఆడి గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది. బాగా చదివి సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధిస్తా.

–పెద్దల్లిగారి గీతిక, 8వ తరగతి, చింతమడక

అథ్లెటిక్స్‌లో రాణిస్తా..



నేను కొద్ది రోజులుగా అథ్లెటిక్స్‌లో పాల్గొంటున్నాను. ఉపాధ్యాయులు, పీడీ ప్రోత్సాహంతో ఇప్పటివరకు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో 600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నాను. రోజు ఉదయం, సాయంత్రం 2 గంటల పాటు సాధన చేస్తున్నాను. ఎలాగైనా జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది.

–జిల్ల అవంతిక, 8వ తరగతి

ప్రత్యేక ప్రణాళికతో శిక్షణ



విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రత్యేక ప్రణాళికతో శిక్షణ అందిస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటున్నారు. ప్రత్యక్షంగా శిక్షణ అందించడం వల్ల బాగా నేర్చుకుంటున్నారు. ఇంకా క్రీడాకారులకు సంబంధించిన సామగ్రి, మెటీరియల్, దుస్తుల వాటికి దాతలు ఎవరైనా సహకరిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలను పొందేందుకు అవకాశం ఉంటుంది.

– వెంకటస్వామి, పీడీ, చింతమడక

ప్రోత్సాహం అందిస్తాం



విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు తల్లితండ్రులతోపాటు ఉపాధ్యాయ బృందం నుంచి మరింతగా ప్రోత్సాహాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఏఏ క్రీడల్లో విద్యార్థులకు ఆసక్తి ఉందో అలాంటి క్రీడల్లో పాల్గొనేలా శిక్షణ అందించడం జరుగుతుంది. పాఠశాలలో మంచి వాతావరణం ఏర్పడేలా ఎప్పటికప్పుడూ నూతన ఆలోచనలకు పదునుపెడుతున్నాం. పీడీ ప్రత్యేక చొరవతో విద్యార్థుల్లో మంచి క్రీడా నైపుణ్యం వెలికితీయడం జరుగుతుంది.

– కొత్త రాజిరెడ్డి, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు, చింతమడక

జిజ్ఞాస పోటీలకు ప్రాజెక్టులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

హుస్నాబాద్: రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీలకు హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల పరిశోధన ప్రాజెక్టులు ఎంపికైనట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను పరిశోధన రంగం వైపు మళ్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం, కళాశాల విద్యా విభాగం ప్రతిష్టాత్మకంగా జిజ్ఞాస పోటీలు నిర్వహిస్తుందన్నారు. వృక్ష శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ బాలరాజ్ ఆధ్వర్యంలో నేల ఉత్పాదకతను పెంచడంలో జీవ ఎరువు అజోల్ల వాడకం అనే అంశంపై, రెండోది రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు గుగులోతు విజయ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో అనే అంశంపై విద్యార్థులు వివరించినట్లు తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జిజ్ఞాస కో ఆర్డినేటర్ డాక్టర్ నైనా దేవి, అధ్యాపకులు కుమారస్వామి, చంద్రమౌళి, అనిల్, అనిత, సబీ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బగ్గీల తనిఖీ



పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్న ఈ బగ్గీలు

నర్సాపూర్: జాతీయ స్థాయి ఈ బాహ సే ఇండియా 2025 పోటీల్లో పాల్గొంటున్న ఎలక్ట్రిక్ బగ్గీల తనిఖీలు చేపట్టారని శ్రీవిష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, ఈ బాహ సే ఇండియా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బాలరాజ్ సుబ్రమణ్యం, సలహాదారుడు కేసీ వోరా తెలిపారు. గురువారం పోటీలు ప్రారంభం కాగా, పలు రాష్ట్రాలలోని 78 ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎలక్ట్రిక్ బగ్గీలకు సాంకేతిక తనిఖీలు చేపట్టారని, నిబంధనల మేరకు ఉన్న బగ్గీలను పోటీలకు అనుమతిస్తారని పేర్కొన్నారు. కాలేజీ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, ఇతర ప్రతినిధులు కాంతారావు, బాపిరాజు, సురేశ్, రాయుడు, దశరథ రామయ్య తదితరులు పోటీల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మనసున్న మిత్రులు

- ఆటోకు డబ్బులు లేక బడికి వెళ్లని విద్యార్థిని
- స్నేహితుడి సాయంతో అండగా నిలిచిన ఉపాధ్యాయుడు నరేశ్
- రూ.5 వేలతో సైకిల్ అందజేత



సైకిల్ అందజేస్తున్న ఎంఈఓ గురునాథ్

రేగోడ్(మెదక్): మనసుంటే మార్గాలెన్నో అని నిరూపించాడు ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఆటోకు చెల్లించడానికి డబ్బులు లేక వారం రోజుల పాటు బడి మానేసింది. తండ్రి లేకపోగా తల్లి ఆర్థిక పరిస్థితి బాగాలేక బడికి దూరంగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు మిత్రుడి సాయంతో ఆమెకు సైకిల్ అందజేసి గొప్ప మనసు చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన శ్రావణి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతుంది. విద్యార్థిని రోజూ పాఠశాలకు ఆటోలో మూడు కిలోమీటర్ల మేర వెళ్తుంది. ఆటోకు ఇవ్వడానికి డబ్బులు లేక వారం రోజుల పాటు బడికి వెళ్లడం లేదు. తండ్రి లేకపోవడం, తల్లి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటుంది. ఇది గమనించిన వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నరేశ్ విద్యార్థినితో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నాడు. ఉపాధ్యాయుడు నరేశ్ ఆంధ్రలోని తాడిపత్రికి చెందిన తన స్నేహితుడు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు రామేశ్వర్‌రెడ్డిని సంప్రదించి విషయం తెలిపాడు. వెంటనే స్పందించిన రామేశ్వర్‌రెడ్డి రూ.5 వేలు పంపించగా నరేశ్ సైకిల్ కొనుగోలు చేసి ఎంఈఓ గురునాథ్ చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశాడు. గోపాల్‌రెడ్డి, నరేశ్ చేసిన సహాయానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

హోమో సెక్స్‌కు అడ్డు చెప్పడంతో హత్య

నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: వ్యక్తి హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. హోమో సెక్స్‌కు అడ్డుచెప్పడంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తేల్చి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. సిద్దిపేట డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన బోదాసు శ్రీను కరీంనగర్‌లోని రేకుర్తి గ్రామానికి చెందిన పర్వతం రాజు(40)కు కొంత కాలంగా స్నేహం ఉంది. రాజు భార్యాపిల్లలకు దూరంగా ఉంటూ సిద్దిపేట పట్టణంలో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి రాజుకు శ్రీను కనిపించగా నర్సాపూర్ చౌరస్తాలో నిర్మాణంలోని ఇంటికి తీసుకెళ్లాడు. రాజు, శ్రీనుకు బాగా మద్యం తాగించగా ఎక్కువై పడిపోయాడు. రాజు హోమో సెక్స్ చేస్తుండగా శ్రీనుకు మెలకువ వచ్చింది. వెంటనే అడ్డుచెప్పి ప్రతిఘటించడంతో రాజు అతడి తలపై కర్రతో దాడి చేసి హత్య చేశాడు. నిర్మాణంలో ఉన్న ఇంటి యజమాని ద్వారా విషయం తెలుసుకున్న ఏసీపీ మధు, సీఐ ఉపేందర్ సిబ్బందితో గురువారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజును అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మాతృభాషను నిర్లక్ష్యం చేయొద్దు

- సహాయాచార్యులు శ్రీలత
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీలత, ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, తదితరులు

సిద్దిపేటఎడ్యుకేషన్: మాతృభాషను నిర్లక్ష్యం చేస్తే మన జాతి జీవనాడి దెబ్బతింటుందని పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు సహాయాచార్యులు కంజర్ల శ్రీలత అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని మాతృభాష పరిరక్షణ, కర్తవ్యాలు అనే అంశంపై శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులు మాతృభాషలో మాట్లాడడాన్ని నిషేధించడం, ఒకవేళ మాట్లాడితే శిక్షలు వేయడం మానుకుంటేనే వారి సృజనాత్మకత పెంపొందుతుందని చెప్పారు. భాషపై ఇలాంటి పెడధోరణులు, అవమానకర విధానాలను మార్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు వివిధ రాష్ట్రాల్లో చదువుతూనే ఇంట్లో మాతృభాష నేర్చుకొని ఎదిగిన వారందరో ఉన్నారని, తాను దాంట్లో భాగమేనన్నారు. అనంతరం తెలుగు శాఖ అధ్యక్షుడు మట్టా సంపత్ కుమార్‌రెడ్డి, తెలుగు అధ్యాపకులు దాసులు మాట్లాడారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరమణ, సంపత్‌కుమార్, శైలజ, రామస్వామి, నరేశ్, నర్సింలు, సాయిసురేశ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కౌజు పిట్టల పెంపకంతో అధిక లాభాలు

ప్రొఫెసర్ డా.కృష్ణ ప్రసాద్



కౌజు పిట్టల పెంపకాన్ని పరిశీలిస్తున్న వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు

మద్దూరు(హుస్నాబాద్): కౌజు పిట్టల పెంపకంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం కోళ్ల శాస్త్ర విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డా.కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సయపల్లిలోని మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి వ్యవసాయ క్షేత్రంలోని కౌజు పిట్టల పెంపకాన్ని యూనివర్సిటీ ప్రొఫెసర్లతోపాటు తమిళనాడు, కేరళ, అస్సాం, ఒరిస్సా రాష్ట్రాలలోని వెటర్నరీ యూనివర్సిటీల ప్రొఫెసర్ల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా డా.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయనికి అనుబంధంగా పశుపోషణ, పౌల్ట్రీరంగంపై దృష్టి సారించాలన్నారు. ఆహారభద్రకు మాంసం కృతులు అవసరమని, కౌజు పిట్టల మాంసంలో అధికంగా మాంసకృతులు ఉంటాయని అన్నారు. ఇటీవల కాలంలో కౌజు పిట్టల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేందుకు కౌజుపిట్టల పెంపకం అనువైందన్నారు.

బంగారం పేరుతో గులకరాళ్లు

- రూ.28 లక్షలు తీసుకొని వ్యాపారిని మోసం
- నిందితుడి అరెస్టు, డబ్బులు రికవరీ

జోగిపేట(అందోల్): బంగారం పేరుతో గులకరాళ్ల మూట ఇచ్చి వ్యాపారిని మోసం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి డబ్బులు రికవరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. నిజాంపేట రోడ్డు, బాలనగర్ ప్రాంతానికి చెందిన గరిమెల్ల సత్యభాస్కర శ్రీనివాస్‌ని అదే ప్రాంతానికి చెందిన సాయికిశోర్ కలిశాడు. నాకు తెలిసిన వ్యక్తి వద్ద బంగారం ఉంది తీసుకుంటావా? అని అడిగి జోగిపేటకు చెందిన ముక్కగల్ల దేవేందర్ ఫోన్ నంబర్ 96037 32181 ఇచ్చి మాట్లాడమన్నాడు. శ్రీనివాస్ దేవేందర్‌కు ఫోన్ చేసి నాకు బంగారం కావాలని అడుగగా జోగిపేటకు వస్తే ఇస్తానని చెప్పాడు. 11వ తేదీన ఇద్దరూ జోగిపేటలో కలుసుకోగా దేవేందర్ ప్రస్తుతానికి నా దగ్గర బంగారం లేదని చెప్పడంతో శ్రీనివాస్ వెళ్లిపోయాడు. మళ్లీ 17వ తేదీన దేవేందర్, శ్రీనివాస్‌కు ఫోన్ చేసి బంగారం ఇస్తానని చెప్పడంతో రూ.28 లక్షలు తీసుకొని జోగిపేటకి వచ్చాడు. స్థానిక టీ స్టాల్ వద్ద ఇద్దరూ కలుసుకున్నారు. బంగారం అని చెప్పి శ్రీనివాస్‌కి ఒక తెల్లటి సంచి ఇచ్చి దేవేందర్ డబ్బులు తీసుకున్నాడు. ఇంటికి వెళ్లేంత వరకు ఆ సంచి తెరవకూడదని చెప్పడంతో శ్రీనివాస్ కారులో వెళ్లిపోయాడు. ఇంటికెళ్లి చూడగా సంచిలో గులకరాళ్లు బయటపడ్డాయి. దీంతో వ్యాపారస్తుడు శ్రీనివాస్ ఒక్కసారిగా షాక్ తిన్నాడు. తిరిగి దేవేందర్‌కు ఫోన్ చేస్తే అందుబాటులోకి రాకపోవడంతో పుల్కల్ పోలీసులకు 19న ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా దేవేందర్‌ను అదుపులోకి తీసుకొని రూ.28 లక్షలు రికవరీ చేసినట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. నిందితుడితోపాటు ఇంకెవరైనా ఉన్నారా అన్న కోణంలో విచారిస్తున్నట్లు తెలిపారు.

పిచ్చి కుక్కకాటుకు గురై..

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

కంగ్టి(నారాయణఖేడ్): పిచ్చి కుక్క కాటుకు గురైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన కంగ్టి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో 28వ తేదీన ఓ పిచ్చికుక్క 14 మందిపై దాడి చేసింది. ఇందులో కంగ్టికి చెందిన మెండె శ్రీకాంత్‌రెడ్డి(27)కి కూడా కాటు వేయడంతో అప్పటి నుంచి క్రమంగా టీకాలు తీసుకొంటున్నాడు. గురువారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో బీదర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంధురాలైన తల్లికి ఆసరాగా ఉన్న కుమారుడు కోల్పోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామంలో కుక్కలు ఎక్కువ అయ్యాయని, అధికారులు ఇప్పటికైనా పట్టించుకొని నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లైంగిక వేధింపుల నియంత్రణకు చర్యలు

న్యాయమూర్తి ఎస్.స్వాతిరెడ్డి



సదస్సులో న్యాయమూర్తి స్వాతి రెడ్డి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, సీఐ దుర్గ

సిద్దిపేటజోన్: మహిళలు పనిచేసే చోట రక్షణగా, లైంగిక వేధింపుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి ఎస్.స్వాతిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక పబ్లిక్ సర్వెంట్స్ హోమ్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మహిళా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలు, హక్కుల గురించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు అందరూ సమానమేన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో మహిళలపై వివక్ష ఉండరాదన్నారు. పదోన్నతుల పేరిట లైంగిక వేధింపులకు పాల్పడ్డా పోక్సో చట్టం పరిధిలో చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ కార్యాలయంలో లైంగిక వేధింపుల నియంత్రణకు యజమాని ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకవేళ ఏర్పాటు చేయకపోతే రూ.50 వేలు జరిమానా విధిస్తామన్నారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురైతే భరోసా సహాయ కేంద్రం, షీ టీమ్ హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సదస్సులో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, పబ్లిక్ సర్వెంట్స్ హోమ్ అధ్యక్షుడు అంజయ్య, జిల్లా బాలల రక్షణ శాఖ అధికారి రాము, డ్వాక్రా మహిళా సంఘాల, అంగన్వాడీ, ఆశ వర్కర్ల, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.